క్లుప్తంగా

దసరా ఉత్సవాలకు రాట ముహూర్తం



దసరా ఉత్సవాలకు పందిరి రాట వేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రామచంద్రపురం: పట్టణంలోని పార్కు సమీపంలో వేంచేసిన కనకదుర్గమ్మ ఆలయం వద్ద నిర్వహించే దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలకు శుక్రవారం రాట ముహూర్తం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి దసరా ఉత్సవాలకు పందిరి రాట వేశారు. ఈ ఏడాది ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఇద్దరికి ఎంపీడీవోలుగా పదోన్నతి



సెలట్ రాజు



సుబ్రహ్మణ్యం

రామచంద్రపురం రూరల్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో డిప్యూటీ ఎంపీడీఓలు, ఏఓలు, డీపీవో కార్యాలయ ఏఓలుగా విధులు నిర్వహిస్తున్న 23 మందికి ఎంపీడీఓలుగా పదోన్నతులు లభించాయి. కాగా రామచంద్రపురం మండలం నుంచి ఇద్దరి పదోన్నతి లభించడం విశేషం. రామచంద్రపురం మండల డిప్యూటీ ఎంపీడీఓ ఎస్.సెలట్ రాజు, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ చాగంటి వెంకట అచ్యుతరామ సుబ్రహ్మణ్యం పదోన్నతి పొందారు. వీరికి ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా చంద్రశేఖర సూర్యప్రకాశ్(బాబీ), ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీడీఓ కడలి పద్మజ్యోతి, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

నాటక రంగ అభివృద్ధికి సహకరించాలి

రామచంద్రపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్‌గా నియమితులైన ద్రాక్షారామకు చెందిన పెంకే అన్నపూర్ణను ద్రాక్షారామ నాటక కళాపరిషత్ అధ్యక్షుడు నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో పరిషత్ సభ్యులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ, సాంబశివరావు దంపతులను శాలువా, పూలమాలతో సత్కరించారు. నాటక రంగ అభివృద్ధికి సహకరించాలని కోరారు. నాటక రంగం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. పరిషత్ కోశాధికారి వేమవరపు రాంబాబు, సభ్యులు గరగ బాబూరావు, వాడ్రేవు వెంకట్రావు, పరిషత్ ఆహ్వాన కమిటీ సభ్యులు బీఎల్ నారాయణ, తీపర్తి సతీష్, ఆళ్ల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

సాయికథ గానరూపకం

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీగణపతి మండపం వద్ద శుక్రవారం సాయికథ గానరూపకం నిర్వహించారు. ఆధ్యాత్మిక గురువు అమ్ముల సాంబశివరావు రూపొందించిన 'సాయి కథ' షిర్డీ సాయిబాబా జీవిత చరిత్రను గాన రూపంలో సాయి సేవకులు వినిపించారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

- వినాయక నిమజ్జనంలో జాగ్రత్తలు తప్పనిసరి
- అన్నసమారాధనల్లో శుభ్రత పాటించకుంటే ఆరోగ్య సమస్యలు
- అధికారుల ఆదేశాలు పాటిస్తే మంచి ఫలితాలు
- నేడు భారీగా గణేశ్ నిమజ్జనాలు



కేదారిలంక రేవు వద్ద గోదావరి నదిలో గణేష్ నిమజ్జనం

కపిలేశ్వరపురం: ఆధ్యాత్మిక వేడుక ప్రజలందరికీ ఆనందదాయకం కావాలి. జనసమూహం శాస్త్రీయంగా జరగకపోతే వేడుక విషాదమయ్యే ప్రమాదం ఉంది. గత నెల 27న గణపతి నవరాత్ర ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. కాగా 1, 3, 5, 9, 11వ రోజుల్లో సాధారణంగా స్వామివారి విగ్రహాలను నిమజ్జనం చేస్తారు. వేడుకల్లో భాగంగా శిబిరాల వద్ద అన్నసమారాధనలు నిర్వహిస్తున్నారు. స్వామివారి విగ్రహాల నిమజ్జనాలు, అన్నసమారాధనల్లో జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. ఏమాత్రం అలసత్వం వహించినా వేల మంది అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉంది. ప్రస్తుతం గౌతమి గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. నిమజ్జనంలో నిబంధనలను విస్మరిస్తే ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది. గత నెల 31న రాష్ట్రంలో పలు చోట్ల జరిగిన అపశృతులు కారణంగా 8 మంది మృత్యువాత పడ్డారు. శనివారం భారీ సంఖ్యలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు. ఈ నేపథ్యంలో నిమజ్జనంలో పాటించాల్సిన జాగ్రత్తలపై ఈ ప్రత్యేక కథనం.

ఆరోగ్య సూత్రాలకు ప్రాధాన్యం

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించే అన్న సంతర్పణ సామూహిక ప్రయత్నంతో సాగుతుంది. వేలాది మందికి ఒకేసారి ఆహార పదార్థాలను వండి పెట్టే సమయంలో నిర్వాహకులు, వంట మనుషులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలి. ఆహార పదార్థాలు కలుషితమైతే మూకుమ్మడిగా భక్తులు ఆరోగ్య సమస్యల బారినపడే ప్రమాదం ఉంది. సురక్షితమైన తాగునీటిని సరఫరా చేయాలి. భక్తులు చేతులు శుభ్రం చేసుకునే ఏర్పాట్లు చేయాలి. వడ్డించేవారు తరచూ చేతులను పరిశుభ్రం చేసుకోవాలి. వేలాది మందికి సరిపడా పదార్థాలను ఉదయాన్నే వండటం అనివార్యం. ఆ పదార్థాలను మధ్యాహ్నం వరకూ మూతలు వేసి సురక్షితంగా భద్రపర్చాలి. పర్యావరణానికి విఘాతం కలగని ప్లేట్లు, గ్లాసులు, సామగ్రిని వాడాలి. వడ్డించే ప్రదేశాన్ని పరిశుభ్రం చేయాలి. వంట చేసేందుకు, తాగేందుకు సురక్షిత నీరునే వాడాలి.

శుభ్రత తప్పనిసరి



అన్న సంతర్పణలో నిర్వాహకులు, అన్న ప్రసాదాన్ని స్వీకరించే భక్తులు తప్పనిసరిగా వ్యక్తిగత, పరిసరాల శుభ్రతను పాటించాలి. తాగునీరు, ఆహార పదార్థాలు, కలుషితం కాకుండా జాగ్రత్త పడాలి. ఆహారం తిన్నాక వికారం, వాంతికావడమనే లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రిని సంప్రదించాలి.

– పీఎస్ఎస్‌డీ రత్నకుమారి, వైద్యాధికారి, అంగర పీహెచ్‌సీ, కపిలేశ్వరపురం మండలం

రెండు నియోజకవర్గాల్లో నిమజ్జనాలు ఇలా..

మండపేట మండలంలోని 12 గ్రామాల్లోని వినాయక విగ్రహాలను ద్వారపూడి అయ్యప్ప ఆలయం ఎదురుగా ఉన్న రేవులో నిమజ్జనం చేస్తారు. అలాగే తాపేశ్వరం లాకులు, కేశవరం రైల్వేగేటు ఎదురుగా, ఏడిద సీతానగరం కాలువ వద్ద, మండపేట పట్టణం పెద్దకాలువ వద్ద, మెహర్ బాబా ఆశ్రమం, వీరభద్రపురం, మారేడుబాక రేవుల్లో నిమజ్జనం చేస్తుంటారు. గౌతమి గోదావరి నదిలో నిమజ్జనం చేయాలని ఆసక్తి కలిగిన భక్తులు కపిలేశ్వరపురం మండలం తాతపూడి, కపిలేశ్వరపురం, కోరుమిల్లి, వాకతిప్ప, కె.గంగవరం మండలం కూళ్ల, కోటిపల్లి, సుందరపల్లి కోట, మల్లవరం, మసకపల్లి పుష్కర ఘాట్లలో నిమజ్జనం చేస్తారు.



అన్నసమారాధనలో వడ్డనకు సిద్ధం చేసిన బూరెలు



వడ్డనకు సిద్ధం చేసిన పులిహోర

అనుభవాలను మరువరాదు

గతంలో డప్పు వాయిద్యాలు, కోలాట నృత్యాలతో ఊరేగింపుగా గణనాథులను తరలించేవారు. ఆధునిక కాలంలో సాంకేతికతతో కూడిన వాయిద్యాలను వినియోగించడంతో నిమజ్జనం వేడకల్లో మరింత ఉత్సాహం ఉరకలు వేస్తోంది. నంద్యాల జిల్లా కోవెలకుంట్లలో గత నెల 31న డీజే శబ్దానికి మట్టి మిద్దె కుప్పకూలింది. అదే రోజు పశ్చిమ గోదావరి, అల్లూరి, చిత్తూరు జిల్లాల్లో ఎనిమిది మంది మృత్యువాతపడ్డారు. అనుభవాలు నుంచి గుణపాఠాన్ని నేర్చుకోక తప్పదు. మద్యం సేవించిన వారిని నిమజ్జన కార్యక్రమానికి దూరంగా ఉంచాలి. అధికారులు సూచించిన గోదావరి, కాలువ రేవుల్లోనే నిమజ్జనం చేయాలి. నది లోతుకు దిగటం, ఈతకు వెళ్లడం చేయకూడదు. వాహనాల్లో విగ్రహాలను అమర్చేటప్పుడు, తరలించేటప్పుడు విద్యుదాఘాతానికి గురికాకుండా చూడాలి. వాహనాలను వేగ నియంత్రణతో నడపాలి. రాకపోకలు సాగించేవారిపై రంగులు చల్లుతూ గొడవలకు పాల్పడకుండా జాగ్రత్తలు వహించాలి. 112, 101, స్థానిక పోలీసు, ఆసుపత్రి, పంచాయతీ, విద్యుత్ శాఖల అధికారులు, అత్యవసర సేవల నంబర్లు శిబిరం నిర్వాహకులు తమ దగ్గర ఉంచుకోవాలి.

ఘనంగా 'సర్వేపల్లి' విగ్రహావిష్కరణ



ద్రాక్షారామ హైస్కూల్‌లో సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌ను ప్రారంభించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని శుక్రవారం పాఠశాల హెచ్‌ఎం పేరిచర్ల శేఖర్ ఆవిష్కరించారు. ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత సర్వేపల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల స్టాఫ్ సెక్రటరీ అవర విస్సు మాట్లాడుతూ పాఠశాలలో 2002–2009 సంవత్సరాల మధ్య చదువుకున్న ఆదివారపుపేట గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు కాలెపు ప్రసాద్, కాలెపు రాజేష్, కాలెపు శ్రీనివాస్ తదితరులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. పూర్వవిద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ కోన నాగజ్యోతి, గ్రామ పెద్దలు కోటిపల్లి అబ్బు, నామా వెంకన్నబాబు, దవులూరి రామకృష్ణ(డీఆర్‌కే), కర్రా నాగేశ్వరరావు, పాఠశాల పీడీ అని శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొల్లపాలెం హైస్కూల్‌కు అవార్డు ప్రదానం



జిల్లా కలెక్టర్, ఎస్పీ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న స్కూల్ హెచ్‌ఎం, పీడీలు

కాజులూరు: ఈ ఏడాది స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ, క్రీడా ప్రతిభా పురస్కారాల ఎంపికలో జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన గొల్లపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు శుక్రవారం అధికారులు, నాయకులు అవార్డు ప్రదానం చేశారు. కాకినాడ జెఎన్‌టీయూ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం ఎస్ఎస్‌బీ సుశీలామణి, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు జి.సునీల్‌కుమార్ జిల్లా కలెక్టర్, ఎస్పీ, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్ హెచ్‌ఎం సుశీలామణి మాట్లాడుతూ జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏటా రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన ఐదు పాఠశాలలను ఎంపిక చేసి అవార్డులు అందజేస్తోందన్నారు. గడిచిన ఏడాదిలో వాలీబాల్, సాఫ్ట్‌బాల్, ఖోఖో, అథ్లెటిక్, రైఫిల్ షూటింగ్, స్విమ్మింగ్ తదితర క్రీడల్లో తమ పాఠశాలకు చెందిన 40 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని బహుమతులు, ప్రశంసాపత్రాలు పొందారన్నారు. ఎడుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో రజిత పథకాలు సాధించారన్నారు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా జిల్లాలో ప్రథమ స్థానం సాధించామని తెలిపారు. వరుసగా నాలుగు ఏళ్లగా స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ, క్రీడా ప్రతిభా పురస్కారానికి గొల్లపాలెం హైస్కూల్ ఎంపికవుతోందని, ఈ ఏడాది ప్రథమస్థానంలో ఎంపిక కావటం ఎంతో గర్వంగా ఉందని అన్నారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్-ఉన్-నబీ వేడుకలు



మండపేట పట్టణంలో ర్యాలీ చేస్తున్న ముస్లింలు



ద్రాక్షారామ ప్రధాన రహదారిలో బైక్ ర్యాలీ చేస్తున్న ముస్లింలు

రామచంద్రపురం రూరల్: మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని మండలంలోని ద్రాక్షారామలో ముస్లింలు శుక్రవారం మిలాద్-ఉన్-నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మార్కెట్‌లోని జామియా మసీదు కమిటీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ముస్లిం మతపెద్దలు మహమ్మద్ తసదుఖ్ హుస్సేన్, గుల్ ఫరాజ్ మహమ్మద్ ప్రవక్త జీవిత విశేషాలను భక్తులకు వివరించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వెలంపాలెం షాబాజియా మసీదు అధ్యక్షుడు సయ్యద్ ఫాజిల్ అజారుద్దీన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

ప్రపంచ శాంతే లక్ష్యం

కపిలేశ్వరపురం (మండపేట): ప్రపంచ శాంతి ఇస్లాం లక్ష్యమని పలువురు వక్తలు అన్నారు. మండపేట నియోజకవర్గంలో శుక్రవారం మిలాద్ ఉన్ నబీ వేడుకలు నిర్వహించారు. మండపేట జామియా మసీదులో ఇమామ్ గులాం మొహమ్మద్ ముర్షిద్ రజ్వీ పర్యవేక్షణలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సయ్యద్ రబ్బానీ, షేక్ మౌలానా, ఎండీ రహీం, ఎండీ అల్తాఫ్, ఎండీ కరీం ఖాదరి, కో ఆప్షన్ సభ్యులు షేక్ ఇబ్రహీం, ముస్లిం జేఏసీ కన్వీనర్ సయ్యద్ ఇబ్రహీం పాల్గొన్నారు.

అంగరలో..

కపిలేశ్వరపురం మండలం అంగర మసీదులో ముతవల్లి మహ్మద్ అబ్బాస్ హుస్సేన్, ఇమామ్ మహ్మద్ నాజీం అక్తర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామంతో పాటు కపిలేశ్వరపురం, టేకి, వల్లూరు, వెదురుమూడి తదితర ప్రాంతాల నుంచి ముస్లిం సోదరులు హాజరయ్యారు.

రాయవరం: మండలంలోని వెదురుపాక మసీదులో శుక్రవారం మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని మసీదులో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్ద అహ్మద్ బాషా ఆధ్వర్యంలో షేక్ ఖాజాబాబు ఖురాన్ పఠించారు. మిలాద్ ఉన్ నబీ విశిష్టతను, మహమ్మద్ ప్రవక్త బోధించిన భక్తి మార్గాన్ని వివరించారు. పలువురు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



వెదురుపాక మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

నానో ఎరువులతో అధిక దిగుబడులు



రైతులకు నానో ఎరువులు అందిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

కె.గంగవరం: పంటల సాగులో నానో ఎరువులను వాడితే పెట్టుబడి ఖర్చు తగ్గడమే కాకుండా దిగుబడి పెరుగుతుందని రామచంద్రపురం ఏడీఏ బి. నాగకుమార్ అన్నారు. మండలంలోని కుందూరులో శుక్రవారం నానో ఎరువుల వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరూ తప్పకుండా నానా ఎరువులను ఉపయోగించుకునేలా సహకరించాలన్నారు. రసాయన ఎరువుల వాడకం వల్ల భూమి కలుషితం అవుతుందన్నారు. నానో ఎరువులు వాడడం వల్ల రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని తెలిపారు. రసాయన ఎరువుల వాడడం వల్ల పెట్టుబడి ఖర్చు పెరిగి రైతులు నష్టపోతారని పేర్కొన్నారు. నానో ఎరువులు వాడడం వల్ల భూమి మంచి ఫలితాలను ఇస్తుందని, తద్వారా దిగుబడి పెరగడంతో పాటు పెట్టుబడి ఖర్చు తగ్గుతుందన్నారు. ఏఓ సద్గురుమూర్తి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

ప్రవచనకర్తకు సన్మానం



ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణంలో ప్రవచన కర్త కౌండిన్యను సత్కరిస్తున్న దృశ్యం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీగణపతి మండపంలో తొమ్మిది రోజుల పాటు గణపతి తత్వంపై ప్రవచనాలు చెప్పిన ప్రవచనకర్త దేవులపల్లి కౌండిన్యను శుక్రవారం ఘనంగా సత్కరించారు. ప్రవచనాల ముగింపు సందర్భంగా వేద పండితులు ఆయనను పూలమాల, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం అధ్యక్షుడు బోనం శ్రీను, కమిటీ సభ్యులు, అర్చకులు జుత్తిక చిన్నా, ఇంద్రకంటి ఆంజనేయులు శర్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతిలో గురువులకు ప్రత్యేక స్థానం

- ఘనంగా గురుపూజోత్సవం
- సీనియర్ ఉపాధ్యాయులకు సత్కారం



రాయవరంలో సత్కారం అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయులతో ప్రజాప్రతినిధులు



మండపేటలో సత్కారం పొందిన ఉపాధ్యాయులు



రామచంద్రపురంలో సత్కారం పొందిన గురువులు



ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో విశ్రాంత హెచ్‌ఎం కృష్ణమూర్తిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

రాయవరం: భారతీయ సంస్కృతిలో గురువులకు ప్రత్యేక స్థానం ఉందని, తల్లిదండ్రుల తర్వాత స్థానం ఉపాధ్యాయులదేనని జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో శుక్రవారం మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. రామచంద్రపురం డీవైఈవో పి.రామలక్ష్మణమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెడ్పీటీసీ మంగతాయారు, ఎంపీపీ వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసే ప్రతి ఉపాధ్యాయుడు ఒక విన్నర్ నిలుస్తారన్నారు. విద్యార్థులను బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య ఒక చక్కటి బాండింగ్ ఉండాలని, అప్పుడే గురుశిష్యుల బంధం మరింత బలపడుతుందన్నారు. ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ ఔన్నత్యాన్ని నిలబెట్టుకునే విధంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. డీవైఈవో రామలక్ష్మణమూర్తి మాట్లాడుతూ వృత్తి పట్ల అంకితభావంతో వ్యవహరించే ఉపాధ్యాయులకు సమాజమే గుర్తింపునిస్తుందన్నారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా స్థాయి అవార్డుకు ఎంపికైన నూలు ఆదినారాయణ, గరగ సీతాదేవి, సంపర వేణుగోపాలసింగుబాబు, కోరుమిల్లి వెంకటరమణలతో పాటు మండల స్థాయిలో ఎంపిక చేసిన ఉత్తమ ఉపాధ్యాయులకు మంగతాయారు, వెంకటరమణ, రామలక్ష్మణమూర్తి చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో దాత వెలగల ఫణికృష్ణారెడ్డి, ఎంఈవో–2 వై.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణానికి పునాది గురువు

కపిలేశ్వరపురం (మండపేట): నవ సమాజ నిర్మాణానికి పునాది గురువు అని పలువురు వక్తలు అన్నారు. మండపేట పట్టణంలోని పాలడుగు సత్యవతి చంద్రమౌళి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం ఎంవీ రాజు ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

విశ్రాంత హెచ్‌ఎంకు ఘన సత్కారం

రామచంద్రపురం రూరల్: నాడు వేసిన మొక్క నేడు మహావృక్షంగా మారి సుమధుర విద్యా ఫలాలు అందిస్తోందని విశ్రాంత హెచ్‌ఎం కోట కృష్ణమూర్తి సేవలను పలువురు కొనియాడారు. ద్రాక్షారామలో హైస్కూల్‌లో శుక్రవారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధిలో ప్రధాన భూమిక పోషించిన అలనాటి హెచ్‌ఎం కోట కృష్ణమూర్తి మాస్టార్‌ను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. పాఠశాల హెచ్‌ఎం పేరిచర్ల శేఖర్, స్టాఫ్ సెక్రటరీ అరవ విస్సు, ఉపాధ్యాయులు ఉమాపతి, అని శ్రీనివాస్, చామర్తి మూర్తి, కోటి ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ అప్పట్లో 160 మంది విద్యార్థులు, ఐదుగురు ఉపాధ్యాయులతో ప్రారంభమైన పాఠశాల నేడు 35 మంది ఉపాధ్యాయులతో ఇంటర్ ప్లస్‌గా ఎదగడంలో కృష్ణమూర్తి మాస్టారు కృషి మరువలేనిదన్నారు. పాఠశాల అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కృష్ణమూర్తి మాస్టారు మాట్లాడుతూ ద్రాక్షారామ ప్రజల సహకారం, ఉపాధ్యాయుల కృషితోనే ఇది సాధ్యమైందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా గురుపూజోత్సవం

రామచంద్రపురం: పట్టణంలో శుక్రవారం గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. పాత బస్టాండ్ సెంటర్‌లోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో 13 మంది విశ్రాంత ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘ గౌరవాధ్యక్షులు వి.కామేశ్వరరావు మాస్టారు, అధ్యక్షుడు పట్నాల రామకృష్ణారావు, కార్యదర్శి ఎన్‌వీఎస్ ప్రసాదరావు, ఆర్థిక కార్యదర్శి పి.శ్రీరామచంద్రమూర్తి ఉపాధ్యక్షులు అంపోలు సత్యనారాయణ సంయుక్త కార్యదర్శి సీహెచ్ రామమూర్తి ల పర్యవేక్షణలో ఈ సత్కారాలు జరిగాయి. 1952, 53లో జన్మించిన విశ్రాంత ఉపాధ్యాయులు పారా వెంకటేశ్వర్లు, ఎ.రామ్మోహనావు, శీలం శివయ్య, విల్లూరి కృష్ణానందమూర్తి మేడిశెట్టి మాసిలమనీ, వానపల్లి ఆది వీరేశలింగం, సలాది వెంకట్రావు, జి.కృష్ణమూర్తి, చిలుకూరి వెంకట సత్య భానుమణి తదితరులను ఘనంగా సత్కరించారు.



కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న కె.గంగవరం హైస్కూల్ హెచ్‌ఎం వెంకటేశ్వరరావు

అవార్డు అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయులు

కె.గంగవరం: మండల పరిధిలోని ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులు శుక్రవారం ప్రజాప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్నారు. జిల్లా కేంద్రం అమలాపురంలో జరిగిన గురుపూజోత్సవంలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా కె.గంగవరం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పొడగట్లపల్లి వెంకటేశ్వరరావు, పామర్రు ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం ఓవీ రమణ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. అవార్డు పొందిన ఉపాధ్యాయులను ఎంఈఓ నాగరాజు, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి, ఎంపీడీఓ శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.